

కూచిపూడిలో విద్యార్థినికి గౌరవ డాక్టరేట్

జిన్నారం, డిసెంబరు 31: కూచిపూడి నాట్యంలో ప్రావీణ్యం చూపినందుకుగాను మండల విద్యార్థికి గౌరవ డాక్టరేట్ దక్కింది. జిన్నారం మండలం సోలక్‌పల్లికి చెందిన విద్యార్థిని అమూల్యారెడ్డికి తమిళనాడు రాష్ట్రం హసూనూరులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్సిటీలో ఆదివారం డాక్టరేట్ ప్రదానం చేశారు.


అమూల్యారెడ్డి

మదన్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వడం లేదని
బీఆర్‌ఎస్‌కు శ్రీధర్‌గుప్తా రాజీనామా

నర్సాపూర్, డిసెంబరు 31: మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని నమ్మించి.. ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నందుకు మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేయనున్నట్టు బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా నాయకుడు, వ్యాపారి పైడి శ్రీధర్‌గుప్తా ప్రకటించారు. నర్సాపూర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మచ్చలేని మనిషిగా పేరున్న మదన్‌రెడ్డిని ఎంపీని చేస్తామని నమ్మించి నర్సాపూర్ అసెంబ్లీ టికెట్ ఇవ్వలేదన్నారు. తీరా పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఆయనకు మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వకుండా మరోసారి మోసం చేయాలని చూస్తున్నట్లు తెలిసిందని ఆరోపించారు. అందుకే బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరడం కోసమే ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావును కలిసినట్లు పేర్కొన్నారు. అనుచరులతో కలిసి త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు వెల్లడించారు.

కొత్త ఆశయాలు..
సరికొత్త ఆశలు

వెల్‌కమ్ 2024


సంగారెడ్డిలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనం

- పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై ఆసక్తి
- కొత్త ఏడాదిలో మెడికల్, నర్సింగ్ కాలేజీల సొంత భవనాలపై ఆశలు
- పటాన్‌చెరు రెవెన్యూ డివిజన్ అయ్యేనా?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, డిసెంబరు 31: కొత్త ఆశలు.. సరికొత్త ఆశయాలతో 2024 సంవత్సరానికి సంగారెడ్డి జిల్లా ప్రజానీకం స్వాగతం పలికారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదివారం అర్ధరాత్రి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గత సంవత్సరం పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తవుతాయన్న ఆశాభావంతో ప్రజలు ఉన్నారు. అలాగే ప్రజలకు ఉపయోగకరంగా ఉండే కొత్త కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇందులో భాగంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పటాన్‌చెరును రెవెన్యూ డివిజన్ చేస్తామని గత జూన్ 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. పటాన్‌చెరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన కేసీఆర్ ప్రజల కోరిక మేరకు పటాన్‌చెరును రెవెన్యూ డివిజన్ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే జూన్ నుంచి ఎన్నికల షెడ్యూలు ప్రకటన వచ్చే అక్టోబరు వరకు నాలుగు నెలల్లో అప్పటి ప్రభుత్వం పటాన్‌చెరుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే జి.మహిపాల్‌రెడ్డి అప్పట్లో అధికార పార్టీకి చెందిన వారైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టు లేదు. ఇక ఇప్పుడు అదే ఎమ్మెల్యే జి.మహిపాల్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నందున రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. సంగారెడ్డి జిల్లాలోని ఒక్క పటాన్‌చెరు నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రెవెన్యూ డివిజన్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. అందువల్ల పటాన్‌చెరు నియోజకవర్గంను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తూ పటాన్‌చెరులో కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పటాన్‌చెరు కేంద్రంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటైనా వసతి లేదన్న కారణంగా సదరు కార్యాలయం సంగారెడ్డి కార్యాలయంలోనే కొనసాగుతున్నది. కొత్త ఏడాదిలోనైనా పటాన్‌చెరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటవుతుందని ఇక్కడి ప్రజలు ఆశతో ఉన్నారు.

మెడికల్ కాలేజీ భవనాలు సిద్ధమయ్యే అవకాశం

సంగారెడ్డిలో కొనసాగుతున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సంబంధించిన సొంత భవనాల నిర్మాణం కొత్త సంవత్సరంలో పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.510 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. రెండో విద్యా సంవత్సరం కొనసాగుతున్న మెడికల్ కాలేజీకి సంబంధించి ఒక్కటే భవనం పూర్తయింది. మెడికల్ కాలేజీకి సంబంధించి హాస్టళ్ల భవనాలు, నర్సింగ్ కాలేజీకి సంబంధించిన భవనాలు పూర్తికావాల్సి ఉన్నది. ఈ భవనాల నిర్మాణాలన్నీ ఏడాది కాలంగా సాగుతున్నాయి. కొత్త సంవత్సరంలోనైనా ఈ భవనాలన్నీ పూర్తయి తమకు వసతులన్నీ సమకూరుతాయన్న ఆశాభావంతో మెడికల్, నర్సింగ్ కాలేజీ విద్యార్థులున్నారు. అలాగే, మునిపల్లి, కోహీర్ మండలాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌కు కొత్త సంవత్సరంలోనైనా మోక్షం కలిగేనా అన్న సంశయంతో ప్రజలున్నారు. మంత్రి దామోదర్ ప్రాతినిధ్యం వహిస్తున్నందున ఈ ఏడాదిలోనైనా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండేనో?

గత సంవత్సరం చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రధాన పక్షాలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు మిశ్రమ ఫలితాలను ఇవ్వగా, బీజేపీకి చేదు అనుభవం మిగిల్చాయి. కాంగ్రెస్ ఒక్క సంగారెడ్డి సీటును కోల్పోయినా కొత్తగా అందోలు, నారాయణఖేడ్ స్థానాలను గెలుచుకున్నది. బీఆర్‌ఎస్ రెండు స్థానాలను కోల్పోయి, కొత్తగా సంగారెడ్డి సీటును దక్కించుకుని మూడు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బీజేపీ అయితే ఓట్ల సంఖ్యను పెంచుకున్నప్పటికీ జిల్లాలోని ఐదింటిలో ఒక్కటీ గెలుచుకోలేక పోయింది. ఈ పరిస్థితుల్లో మరో మూడు, నాలుగు నెలల్లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ నియోజకవర్గాల ఫలితాలు ఎలా ఉంటాయోనని ఆసక్తి నెలకొన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో లాగే కాంగ్రెస్, బీజేపీల కంటే బీఆర్‌ఎస్ ఒక్క అడుగు ముందుకేసి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం మొదలు పెట్టడం గమనార్హం.


(ఫైల్ ఫొటో)

రౌండప్ 2023
మెదక్ జిల్లా

మారిన రాజకీయం

- ఉత్కంఠగా అసెంబ్లీ ఎన్నికలు
- మెదక్‌లో బీఆర్‌ఎస్ కోటకు బీటలు
- నర్సాపూర్‌లో పట్టు నిలుపుకున్న గులాబీ పార్టీ
- ఎన్నికల ప్రచారంలో హేమాహేమీలు
- జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- అన్నదాతకు సహకరించని ప్రకృతి
- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు
- 2023లో మెదక్ జిల్లాకు ఎన్నో జ్ఞాపకాలు

7లో


మెదక్‌లో నిర్మితమైన నూతన కలెక్టరేట్

2023లో మెదక్ జిల్లా రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. రాజకీయ నాయకుల భవితను మార్చిన ఏడాదిగా ఎప్పటికీ గుర్తుండిపోతుంది. సంవత్సరం చివరల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆసక్తికరమైన ఫలితాలు వెలువడ్డాయి. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఓటర్లు భిన్నంగా తీర్పునిచ్చారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలిసారి మెదక్‌లో హస్తం పార్టీ గెలుపొందింది. నర్సాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చినప్పటికీ బీఆర్‌ఎస్ విజయం సాధించి పట్టు నిలుపుకున్నది. మెదక్ నియోజకవర్గంలో అనూహ్యంగా కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు విజయం సాధించి, మొదటిసారి శాసనసభలో అడుగుపెట్టారు. నర్సాపూర్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి స్థానంలో బరిలో నిలిచిన మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి బీఆర్‌ఎస్ తరఫున గెలుపొందారు.

చెరకు బిల్లుల బకాయిలపై
ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్


జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు, రైతులు

జహీరాబాద్, డిసెంబరు 31 : చెరకు రైతులకు ట్రైడెంట్ ఫ్యాక్టరీ పెండింగ్ బిల్లులను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మశ్చందర్, ఆయా మండలాలకు చెందిన నాయకులు తట్టు నారాయణ, నర్సింహులు, వెంకటేశం, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు చెరకు రైతులు కోరారు. జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చెరకు బిల్లుల బకాయిల చెల్లింపులపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో బీఆర్‌ఎస్ హయాంలో కర్మాగారం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చి రూ.70 కోట్ల వరకు బిల్లులు ఇప్పించామని గుర్తుచేశారు. ఇంకా రూ.9కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల అనంతరం బిల్లులు ఇప్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా రైతుల సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా మూతపడిన నిజాం చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) గ్రామంలో ఉన్న ట్రైడెంట్ కర్మాగారాన్ని కూడా ఆధీనంలోకి తీసుకుని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ ప్రాంతంలో అత్యధికంగా చెరకు పండించే రైతుల ఇబ్బందులను గుర్తించి ట్రైడెంట్ కర్మాగారాన్ని తెరిపించడమో.. కొత్త ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడమో చేయాలని కోరారు. చెరకు రైతులకు అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించారు. చెరకు రైతులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పించకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఝరాసంగం జడ్పీటీసీ వినీలానరేష్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు బండి మోహన్, సుభాష్‌రావు, నాయకులు శివప్ప, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

భర్త మృతి... మనస్తాపంతో
బావిలో దూకి భార్య ఆత్మహత్య

- జహీరాబాద్ మండలం కాశీంపూర్ గ్రామంలో ఘటన

7లో

కరసేవకుల సన్మాన సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

గజ్వేల్, డిసెంబరు 31: కరసేవకుల సన్మాన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీజేపీ కరసేవకుల సమితి సభ్యుడు ఎం.గిరీశ్‌రెడ్డి, డాక్టర్ నరేశ్ బాబు పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో 1990-92 సంవత్సరపు కరసేవకులకు ఉమ్మడి మెదక్ జిల్లా హిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, వివిధ క్షేత్రాల, బీజేపీ కార్యకర్తల సహకారంతో జరిగే సన్మాన సమ్మేళనాన్ని ఈనెల 20 లేదా 24న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన నిర్వహణ కమిటీలను నిర్ణయించడానికి సన్నాహక సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 1990-92 కరసేవకుల కల శ్రీరామ మందిర పునఃనిర్మాణమని, ఎవరైతే త్యాగధనులు, కరసేవకులు ఉద్యమించి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అయోధ్య కరసేవలో పాల్గొన్నారో వాళ్లందరి కల నెరవేరి 22న రామజన్మభూమిలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారితో నాయకులు ధరం గురువారెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ హరినాథ్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, శివాజీ, సంజీవరెడ్డి, కుడిక్యాల రాములు, అడ్వకేట్ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

భర్త మృతితో బావిలో దూకి మహిళ ఆత్మహత్య

జహీరాబాద్, డిసెంబరు 31: భర్త మృతిచెందడంతో బెంగ చెందిన మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జహీరాబాద్ మండలంలోని కాశీంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తమ్మలి మాధవి(38) భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి భర్తపై బెంగతో ఉన్న మాధవి ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుమారుడు వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా నేలపట్నం గ్రామానికి చెందిన మహేష్(26) లారీ డ్రైవర్. పట్టణంలోని సిద్ధేశ్వరాలయ సమీపంలోని నర్సరీల్లో మామిడి మొక్కలను లారీలో నింపుకునేందుకు ఆదివారం వెళ్లాడు. తాటిపత్రిని తీసుకోవడానికి లారీ క్యాబిన్ మీదకు ఎక్కగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


తూప్రాన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ(ఫైల్)


మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయం

మారిన రాజకీయం

● జిల్లాలో ఆసక్తికరంగా అసెంబ్లీ ఫలితాలు ● మెదక్‌లో బీఆర్ఎస్ కోటకు బీటలు ● నర్సాపూర్‌లో పట్టు నిలుపుకున్న బీఆర్ఎస్



స్కూటీని టిప్పర్ ఢీకొనడంతో మృతిచెందిన పృథ్వీతేజ్, ప్రణయ్‌తేజ్, రోధిస్తున్న తల్లి అన్నపూర్ణ, కుటుంబసభ్యుల ఫొటో(ఫైల్)

రౌండప్ 2023
మెదక్ జిల్లా

మెదక్ అర్బన్, డిసెంబరు 31: తీపి జ్ఞాపకాలు, చేదు సంఘటనల సమాహారంగా 2023 నిలిచింది. రాష్ట్ర రాజకీయాల మాదిరిగానే మెదక్ జిల్లా రాజకీయాల్లోనూ ఈ ఏడాది ముఖచిత్రం మారిపోయింది. మెదక్‌లో హస్తం పార్టీ గెలుపొందింది. ఇక నర్సాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చి ఇతరులకు టికెట్ ఇచ్చి బీఆర్ఎస్ పట్టు నిలుపుకున్నది.

ఎన్నిక షెడ్యూల్ వెలువడింది మొదలు ఓట్ల లెక్కింపు వరకు నాటకీయ పరిణామాలెన్నో చోటు చేసుకున్నాయి. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో ఎక్కడచూసినా ఎన్నికల సందడే కనిపించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర నేతలు విచ్చేశారు. నవంబరు 26న తూప్రాన్ ఎన్నికల ప్రచారంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్నారు. నవంబరు 15న మెదక్‌లో 16న నర్సాపూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. నవంబరు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లలో జరిగిన ప్రచార సభలో పాల్గొన్నారు. అక్టోబరు 29న మెదక్‌లో నిర్వహించిన విజయభేరి యాత్రలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. నవంబరు 20న నర్సాపూర్ విజయభేరీ సభకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. నవంబరు 21న మెదక్ రోడ్‌షోలో విజయశాంతి పాల్గొన్నారు. నవంబరు 23న చేగుంటలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ బీజేపీకి మద్దతుగా ప్రచారం చేశారు. నవంబరు 27న బీజేపీకి మద్దతుగా అసోం సీఎం హిమంతబిశ్వాశర్మ రోడ్‌షో నిర్వహించారు.

అభివృద్ధి పనులు.. పథకాల ప్రారంభం

ఆగస్టు 23న మెదక్ జిల్లాకు సీఎం కేసీఆర్ వరాల జల్లు ప్రకటించారు. జిల్లా నూతన కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల ప్రారంభోత్సవం అనంతరం ప్రగతి నివేదన సభలో కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మెదక్‌కు రింగ్‌రోడ్డు, ఏడుపాయల ఆలయాన్ని గతంలో ప్రకటించిన టూరిజం ప్యాకేజీలో భాగంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 469 గ్రామపంచాయతీలకు రూ.15 లక్షల చొప్పున నిధులు, మెదక్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, మిగితా మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్‌తోపాటు కౌడిపల్లి, రామాయంపేటలో డిగ్రీ కళాశాలలను మంజూరు చేశారు.

- జూలై 5న జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేస్తూ.. ప్రభుత్వం పరిపాలన అనుమతుల ఉత్తర్వులు జారీచేసింది.
- సెప్టెంబరు 16న 100ఎంబీబీఎస్ సీట్లతో రూ.180 కోట్ల అంచనా వ్యయంతో మెదక్ జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల నిర్మాణానికి అనుమతులు జారీచేసింది.
- జనవరి 19న రెండో విడత కంటివెలుగు కార్యక్రమం ప్రారంభం
- అక్టోబరు 28న ప్రభుత్వ పాఠశాల్లో అల్పాహార పథకాన్ని కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు.
- బీసీబంధు, మైనార్టీ బంధు పథకాల కింద రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.

ముఖ్యమైన ఘటనలు...

జనవరి 9న బీమా సొమ్ము కోసం హత్య.. టేక్మాల్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారులో సంచలనం సృష్టించింది. బీమ్లాతండాకు చెందిన సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పాత్‌లోత్ ధర్మా బీమా సొమ్ము కోసం బాబు అనే వ్యక్తిని హత్య చేసి, మృతదేహాన్ని కారు ముందు పెట్టి పెట్రోల్ పోసి తగులబెట్టాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ధర్మాతోపాటు అల్లుడు శ్రీనివాస్, భార్య నీల, అక్క సునంద, కొడుకు(మైనర్)ను అరెస్టు చేశారు. నిందితులపై 302, 364, 120బి, 201, 202, 212 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

- జనవరి 29న మెదక్ పట్టణానికి చెందిన ఖదీర్‌ఖాన్ దొంగతనం చేశాడని అనుమానిస్తూ.. హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి.. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తీవ్రంగా కొట్టడంతో చికిత్స పొందుతూ ఫిబ్రవరి 9న మృతి చెందాడు. ఈ విషయంలో పట్టణ సీఐ మధు, ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుళ్లు ప్రశాంత్, పవన్‌ను సస్పెండ్ చేశారు.
- ఆగస్టు 24న మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని హైదరాబాద్‌లోని హరీశ్‌రావు ఇంటి ఎదుట మదన్‌రెడ్డి అనుచరులు ధర్నా చేశారు.
- నవంబరు 12న టేక్మాల్ మండల పరిధిలోని కాదులూర్ గ్రామానికి చెందిన అన్నపూర్ణ తన కుమారులు పృథ్వీతేజ్(08), ప్రణయ్ తేజ్(10)లతో కలిసి మెదక్‌లోని జంబికుంటలో నివాసముంటున్నది. దీపావళి సందర్భంగా టపాసుల కోసం అన్నపూర్ణ తన కుమారులతో స్కూటీపై వెళ్తున్న క్రమంలో టిప్పర్ ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరు చిన్నారుల దుర్మరణం చెందారు.
- నవంబరు 16న నర్సాపూర్‌లో కేసీఆర్ పాల్గొన్న ప్రజా ఆశీర్వాద సభలో అస్లాం అనే యువకుడి వద్ద బుల్లెట్లు దొరకడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేగింది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌కు చెందిన అస్లాం చిలప్‌చెడ్ మండల పరిధిలోని చండూర్‌లో చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. అస్లాం 2016లో జోగిపేటలో డిగ్రీ చదువుతున్నప్పుడు ఎన్‌సీసీ విభాగంలో ఖాసీపూర్‌లో శిక్షణ పొందాడు. అప్పుడే అక్కడి ఓ గదిలో ఉన్న రెండు తుపాకీ బుల్లెట్లను వెంట తెచ్చుకున్నాడు. సభకు బుల్లెట్లను జేబులో పెట్టుకొని రాగా.. పోలీసులు తనిఖీల్లో దొరికాడు. నిందితుడు అస్లాంను అరెస్ట్ చేసి రెండు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు నర్సాపూర్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు.
- డిసెంబరు 4న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన శిక్షణ విమానం(పిలాటసర్ పీసీ-7 ఎంకే-2) తూప్రాన్ పరిధిలోని రావెల్లి శివారులో గుట్టపై పడిపోయి, మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో విమానంలోని పైలట్ (ఇన్‌స్ట్రక్టర్) అభిమన్యురామ్, వియత్నాం దేశానికి చెందిన వువన్‌తైన్ ట్రెయినీ పైలట్ ఇద్దరూ మృతిచెందారు. ఉదయం 8:34 సమయంలో తూప్రాన్ శివారులో గాల్లోంచి ఒక్కసారిగా కిందికి దూసుకొచ్చి, టాటా కాఫీ కంపెనీ సమీపంలో గుట్టపై కూలిపోయింది. మంటలు చెలరేగడంతో పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో అభిమన్యురామ్, వువన్‌తైన్ మృతదేహాలు ముక్కలు, ముక్కలై చెల్లాచెదురుగా పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎయిర్‌ఫోర్స్ కమాండెంట్ శ్రీనివాస్ సహా ఇతర అధికారులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బెంగళూర్‌కు చెందిన సీఎన్‌సీ నాయర్ హెలికాప్టర్‌లో వచ్చి పరిశీలించారు. మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్‌లో అక్కడి నుంచి తరలించారు.


నిందితుడు, ప్రభుత్వ ఉద్యోగి ధర్మా, రెండో నిందితుడు శ్రీనివాస్‌ను మీడియా ఎదుట ప్రవేశపెడుతున్న ఎస్పీ రోహిణీప్రియదర్శిని(ఫైల్)


టేక్మాల్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారులో దగ్ధమైన కారు, కారులోనే సజీవ దహనమైన వ్యక్తి(ఫైల్)


పోలీసుల దెబ్బలకు మృతిచెందిన ఖదీర్‌ఖాన్(ఫైల్)


మెదక్ జిల్లా నూతన కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న కేసీఆర్ పక్కన హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి(ఫైల్)

- డిసెంబరు 18న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణపై కేసు నమోదైంది. దళితబంధు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేశాడంటూ టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచకు చెందిన జంగిడగల్ల భూమయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనతోపాటు నలుగురికి దళితబంధు మంజూరైంది. ఆ డబ్బులు కావాలంటే ఒక్కొక్కరు రూ.3 లక్షల చొప్పున ఇవ్వాలని అప్పటి ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఆయన సోదరుడు రాహుల్‌కిరణ్ డిమాండ్ చేశారు. అందోల్‌లోని క్యాంపు కార్యాలయంలో క్రాంతికిరణ్, రాహుల్‌కిరణ్‌కు రూ.6 లక్షలు ఇచ్చామని భూమయ్య తెలిపాడు. ప్రభుత్వ మారడంతో దళితబంధు ఇప్పిస్తారా.. అని అడిగితే బీఆర్ఎస్ సర్కార్ వచ్చినప్పుడే తీసుకోవాలని క్రాంతికిరణ్ బదులిచ్చారు. తమ డబ్బులు తిగిరి ఇవ్వమని అడిగితే ఆయన అనుచరులతో ఫోన్ చేయించి చంపుతానని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో భూమయ్య పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ రమేష్ వెల్లడించారు.

ఏడాది పొడవునా వెంటాడిన అతివృష్టి

మెదక్ జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 3.45 లక్షల ఎకరాల్లో వరి పంటతోపాటు వివిధ రకాల పంటలు సాగుచేశారు. పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు కురిశాయి. ఏప్రిల్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు జిల్లావ్యాప్తంగా 12.265 ఎకరాల్లో పంట దెబ్బతింది. పంట నష్టపోయిన రైతులకు రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తామని అప్పట్లో కేసీఆర్ హామీఇచ్చారు. జిల్లాలో రూ.12 కోట్ల 25 లక్షల, 86 వేల పంట నష్టం వాటిల్లిందని అధికారులు గుర్తించారు. బాధిత రైతులకు రూ.8.86 లక్షలు మాత్రమే అందజేశారు. మిగితా రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు.

రుణమాఫీ కోసం ఎదురుచూపులు

కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. జిల్లాలో రూ.లక్షలోపు రుణాలకు 1,50,514 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. ఇప్పటివరకు 73,026 మంది రైతులకు రూ.366 కోట్లు మాత్రమే మాఫీ అయింది. ఇంకా 77,488 మంది రైతులకుగాను రూ.546 కోట్లు మాఫీ కావాల్సి ఉన్నది. నిత్యం బ్యాంకుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తూ.. రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రైతుబంధు ఇంకా అందలేదు. జిల్లాలో 2,80,949 మంది రైతులు 3,06,437 ఎకరాల్లో వరితో పాటు వివిధ రకాల పంటలు సాగుచేశారు. వీరందరికీ పాత పద్ధతిన ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.200 కోట్ల 71లక్షల 74 వేలు రైతుల ఖాతాల్లో పడాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కేవలం ఎకరం లోపు ఉన్న 1,11,241 మంది రైతులకు రూ.21కోట్ల 9లక్షల, 81 వేలు జమ చేసినట్లు అధికారిక లెక్కలు పేర్కొంటున్నాయి.

మెదక్ చర్చికి వందేళ్ల చరిత్ర

దశాబ్దాలు గడిచినా చెక్కుచెదరని చారిత్రక కట్టడం.. ఆసియాలోనే రెండో అతిపెద్ద మెదక్ సీఎస్ఐ(చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా). అలనాడు వెలిసిన అద్భుత సౌధం. అందులో అడుగిడితే చాలు ఆధ్యాత్మిక పరిమళాలతో పునీతమవుతాం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చి 99 ఏళ్లు పూర్తి చేసుకొని డిసెంబరు 25న వందేళ్లలో అడుగిడింది. క్రిస్మస్ వేడుకల సందర్భంగా మెదక్ చర్చిలో దశాబ్ది వేడుకలను బిషప్ పద్మారావు ప్రారంభించారు. ఏడాది పొడవునా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. లండన్‌కు చెందిన రెవరెండ్ చార్లెస్ వాకర్ ఫ్రాస్నేట్ అనే మతగురువు చర్చి నిర్మాణానికి పూనుకున్నాడు. పనికి ఆహారం పథకం కింద ప్రారంభించి.. నిర్మాణంలో అందరూ పాలుపంచుకునేలా స్థానికులకు అవకాశం కల్పించారు. గోతిక్ విధానంలో చేపట్టిన ఈ చర్చి నిర్మాణం 1914లో ప్రారంభమై 1924 డిసెంబరు 25న పూర్తయింది. 350 ఎకరాల విస్తీర్ణంలో 12 వేల మంది కార్మికులు పదేళ్ల శ్రమించి అద్భుత కట్టడాన్ని సాకారం చేశారు. చారిత్రక కట్టడానికి సంబంధించి చర్చి గోపురం ఎత్తు 173 అడుగులు.. పొడవు 200 అడుగులు.. వెడల్పు 100 అడుగులు.. ఈ కట్టడానికి మూడు గవాక్షములు, పలు రంగుటద్ద ములతో ప్రతిష్ఠంపజేశారు. ఇందుకు కావాల్సిన నిధులను ఫ్రాస్నేట్.. ఇంగ్లండ్ నుంచి విరాళాలు సేకరించారు. అప్పట్లో నిర్మాణానికి రూ.14 లక్షలు ఖర్చు అయినట్లు అంచనా.. అలా మహోన్నత ఉద్దేశంతో శ్రమజీవుల చెమట నుంచి పుట్టిందే మెదక్ చర్చి.


మెదక్ చర్చి వందేళ్ల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బిషప్ పద్మారావు, కమిటీ సభ్యులు


మెదక్ నర్సుఖేడ్‌లో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)


కాంగ్రెస్ విజయభేరి యాత్రలో పాల్గొన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి(ఫైల్)


తూప్రాన్ పరిధిలోని రావెల్లి శివారులో గుట్టపై పడిపోయి, మంటల్లో కాలిపోతున్న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ విమానం(ఫైల్)


కొండపాక మండలం మర్పడగలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రం నూతన సంవత్సర క్యాలెండర్‌ను క్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆదివారం ఆవిష్కరించారు.

జిన్నింగ్‌మిల్లును తనిఖీ చేసిన జిల్లా అధికారులు

రాయపోల్, డిసెంబరు 31: దౌల్తాబాద్ మండలం అహ్మద్‌నగర్ శివారులోని కాటన్ జిన్నింగ్ మిల్లు కాంటాను తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. అహ్మద్‌నగర్‌లోని తిరుమల జిన్నింగ్ మిల్లులో తూకంలో మోసం చేస్తున్నారంటూ రైతులు పత్తి మిల్లు వద్ద శనివారం ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పత్తి మిల్లును తనిఖీ చేసి, కాంటాను సీజ్ చేశారు. కాంటాను లారీ మరియు బాట్లతో తనిఖీ చేయగా తూకంలో సుమారు ఇరవై కిలోల వరకు తేడా వస్తుందని జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీంతో కాంటాను సీజ్ చేశామని పేర్కొన్నారు. తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


అహ్మద్‌నగర్‌లోని తిరుమల జిన్నింగ్ మిల్లులో కాంటాను తనిఖీ చేస్తున్న అధికారులు

పరిశ్రమలకు బలవంతంగా
భూముల సేకరణ అన్యాయం

● దళిత, బహుజన మానవ హక్కుల వేదిక నాయకులు



అల్లీనగర్‌లో రైతులను కలిసిన నాయకులు

జిన్నారం, డిసెంబరు 31: పరిశ్రమల కోసం రైతుల భూములు బలవంతంగా సేకరించటం అన్యాయమని రాష్ట్ర దళిత, బహుజన మానవ హక్కుల వేదిక నాయకులు అన్నారు. ఆదివారం గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్‌లో బృందం నాయకులు శంకర్, శ్రేయ, సురేష్, రోహిత్, సంజీవ, కల్పనా, న్యాయవాది శ్రీకాంత్ పర్యటించారు. ఇటీవల సర్వే నంబర్ 27లో రైతులు సాగులో ఉన్న అసైన్డ్ భూములను ప్రభుత్వం పరిశ్రమల కోసం స్వాధీనం చేసుకోవడం తగదని మండిపడ్డారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతుల పట్ల ప్రభుత్వ తీరు మారాలని అన్నారు. రైతులకు అండగా ఉంటామని, వారి పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు.

జిల్లాలో 30 యాక్ట్ అమలు

● మెదక్ ఇన్‌చార్జి ఎస్పీ సింధుశర్మ

మెదక్ అర్బన్, డిసెంబరు 31: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని జనవరి 1 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సింధుశర్మ ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.

దుకాణాల్లో న్యూ ఇయర్ సందడి



మెదక్‌లోని బేకరీలో జనాల సందడి



సంగారెడ్డి పట్టణంలోని ఓ వైన్స్ వద్ద జనాల రద్దీ



సంగారెడ్డిలోని ఓ బేకరీలో కేక్‌ల కోసం వేచి ఉన్న జనం

● భారీగా మద్యం, కేకులు, మాంసం అమ్మకాలు

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, డిసెంబరు 31: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మద్యం దుకాణాలు, బేకరీలు ఆదివారం సందడిగా మారాయి. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2024 సంవత్సరానికి స్వాగతం పలికేందుకు యువత సన్నాహాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైన్స్, బేకరీల్లో భారీగా విక్రయాలు జరిగాయి. అలాగే మాంసం దుకాణాలు కూడా ప్రజలతో కిక్కిరిశాయి. బిర్యానీ పాయింట్ నిర్వాహకులు, బేకరీల యజమానులు కేకులకు బంపర్ ఆఫర్లను ప్రకటించి అమ్మకాలు జరిపారు. ఆదివారం రాత్రి 12 గంటల వరకు విందులు, వినోదాలతో ఎంజాయ్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆదివారం న్యూఇయర్ వేడుకలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. ఉదయం నుంచే యువతీ, యువకులు వేడుకల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. అర్ధరాత్రి 12 దాటగానే పల్లెలు, పట్టణాలు యువత, మహిళలు, పిల్లల కేరింతలతో మార్మోగాయి. ఇళ్ల నుంచి వీధుల్లోకి వచ్చి ఒకరికొకరు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులకు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్‌ల ద్వారా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. దాదాపు గంటసేపు వరకు ఫోన్‌లన్నీ బిజీగా మారిపోయాయి.



మెదక్ పట్టణంలోని ఓ వైన్స్ వద్ద రద్దీ

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

● హుగ్గెల్లిలో మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

జహీరాబాద్, డిసెంబరు 31: మండల పరిధిలోని హుగ్గెల్లి గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయ ఆవరణలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. గొల్లబీర్ల కళాకారుల ఆట,పాటలతో మార్మోగింది. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు హుగ్గెల్లి రాములు, గ్రామసర్పంచ్ రాజు, ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ కిషన్ పాల్గొన్నారు. మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో మాజీమంత్రి చంద్రశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనవెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి ఉన్నారు.

కొత్వాన్‌పల్లిలో మల్లికార్జునస్వామి కల్యాణం

రేగోడు: మండలంలోని కొత్వాన్‌పల్లి గ్రామంలో ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద అగ్నిగుండం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి మల్లికార్జున స్వామి ఆలయానికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

దేవునిపల్లి మల్లన్నగుట్ట జాతర

కల్హేర్: మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామ శివారులో దేవునిగుట్టపై వెలసిన మల్లన్నస్వామి ఆలయ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు యాదవ సంఘం సభ్యులు, నాయకులు స్వాగతం పలికారు. ఉత్సవాల్లో వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ దిలీప్‌కుమార్, దేవునిపల్లి సర్పంచ్ సులోచనభూపాల్, మాసాన్‌పల్లి మాజీ సర్పంచులు గోపాల్, మోహన్‌రెడ్డి, కిష్టాగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాదవరెడ్డి, తుకారాం, సంగమేశ్వర్, యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్‌గుప్తా, శ్రీకాంత్ పాల్గొన్నారు.



హుగ్గెల్లి గ్రామంలో మల్లన్న ఆలయంలో కల్యాణమహోత్సవం



రేగోడు మండలం కొత్వాన్‌పల్లిలో మల్లికార్జునస్వామికి బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



కల్హేర్ మండల పరిధిలోని దేవునిపల్లి మల్లన్న గుట్ట జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

యాదవసంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు

నర్సాపూర్: నర్సాపూర్‌లో యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లికార్జునస్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం రెండోరోజు కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతపూజ, గంగకు వెళ్లడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

హోటల్‌లో ఆలయ సమీక్ష సమావేశం.. సిగ్గుచేటు

చేర్యాల, డిసెంబరు 31: కొమురవెల్లి మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాల సమీక్షా సమావేశాన్ని స్థానికంగా కాకుండా పొరుగు మండలంలోని హోటల్‌లో నిర్వహించడం సిగ్గుచేటని కొమురవెల్లి జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప విమర్శించారు. కొమురవెల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణ పట్ల ఆలయంలోనే అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, కేవలం రాజకీయ దురుద్ధేశంతోనే మార్పు చేసి ఆలయ సంప్రదాయాన్ని కాలరాశారని విమర్శించారు. ప్రొటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు మండల ప్రజాప్రతినిధులను అవమానపరచడాన్ని ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడితే తప్పక తమదైన శైలిలో సమాధానం చెబుతామన్నారు. సమావేశంలో ఎంపీపీ తలారి కీర్తన, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ప్రభుత్వం : సీపీఎం

మల్లన్న భక్తుల మనోభావాలను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రొటోకాల్ పాటించకపోవడం తగదని సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి పేర్కొన్నారు. కొమురవెల్లిలో ఆదివారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చామని ఇష్టానుసారం వ్యవహరించడం సబబుకాదన్నారు. మినర్వ హోటల్‌లో సమావేశాన్ని నిర్వహించడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, మల్లేశం, సాయిలు పాల్గొన్నారు.

దుద్దెడ శంభు ఆలయ ట్రస్ట్ చైర్మన్ మృతి

కొండపాక, డిసెంబరు 31: మండలంలోని దుద్దెడ స్వయంభు శంభు దేవాలయ ట్రస్ట్ చైర్మన్ గొల్లపల్లి రామచంద్రమూర్తి శర్మ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. అంత్యక్రియలు ఆదివారం దుద్దెడలో నిర్వహించారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు

కోహీర్, డిసెంబరు 31: మండల కేంద్రమైన కోహీర్‌లోని హజ్రత్ సయ్యద్ మౌలానా మోహీజొద్దీన్ ఉర్సులో భాగంగా ఆదివారం దర్గా వద్ద నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. కుస్తీ పోటీలకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన మల్లయోధులతో పాటు హైదరాబాద్‌కు చెందిన దాదాపు 50 మంది మల్లయోధులు పాల్గొన్నారు. గెలుపొందిన మల్లయోధులకు ఉర్సు కమిటీ సభ్యులు నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. అంతకుముందు పలువురు కుస్తీ పోటీలను ఉద్దేశించి మాట్లాడుతూ అంతరించిపోతున్న కుస్తీ పోటీలను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు.

మంత్రి దామోదర్‌ను కలిసిన విశ్రాంత ఉద్యోగులు



మంత్రి దామోదర్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

జోగిపేట, డిసెబరు 31: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర్ రాజనర్సింహను ఆయన నివాసంలో అందోలు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రసాద్ జైన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దామోదర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘనంగా సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షుడు రాధాక్రిష్ణాగౌడ్, కోశాధికారి శంకరప్ప, జిల్లా కార్యదర్శి నవీన్‌కుమార్‌గౌడ్, ప్రచార కార్యదర్శి సీహెచ్.వీరేశం, సీనియర్ నాయకులు వై.దుర్గారాం, నర్సింహులు, సదాశివగౌడ్, భూమయ్యగుప్తా, సత్యనారాయణ ఉన్నారు.

టీయూడబ్ల్యూజే అధ్యక్షుడికి సన్మానం

గజ్వేల్, డిసెంబరు 31: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఖాజా విరాహత్‌అలీని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవెల్లి మల్లికార్జున్, మర్కుక్ మండలం టీపీటీఎఫ్ అధ్యక్షుడు విద్యాధర్ రెడ్డి, ములుగు మండల అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ ఘనంగా సన్మానించారు. సికింద్రాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం వారు ఆయనతో కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని కోరారు.

నారాయణఖేడ్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, డిసెంబరు 31: ఖేడ్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు ఎమ్మెల్యేను ఆయన నివాసం వద్ద కలిసి, సన్మానించారు. ఇండోర్ స్టేడియం ఏర్పాటు గురించి ఆయనకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే.. స్టేడియం లేకున్నా రాష్ట్ర స్థాయికి అనేక మంది క్రీడాకారులు ఎంపికవ్వడం గొప్ప విషయం అన్నారు. ఖేడ్‌లో తప్పకుండా స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారుతి, ఖేడ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌సాజిద్, రవికుమార్, సభ్యులు భూమయ్య ప్రవీణ్, రవి యాదవ్ ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్ప విగ్రహానికి అభిషేకం చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, కుమారుడు భరత్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 31: సంగారెడ్డి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నివాసంలో ఆదివారం అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మహా పడిపూజను నిర్వహించారు. ఈ పూజలకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, కుమారుడు భరత్‌రెడ్డి హాజరయ్యారు. అయ్యప్ప విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సంగారెడ్డితో పాటు చుట్టుపక్క గ్రామాల నుంచి వందలాది మంది అయ్యప్ప భక్తులు హాజరయ్యారు. అయ్యప్ప భజనలు, భక్తి పాటలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. అనంతరం అయ్యప్పస్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు.

శివకుమార్‌కు అవార్డు ప్రదానం

నారాయణఖేడ్, డిసెంబరు 31: మండల పరిధిలోని అనంత్‌సాగర్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును అందుకున్నారు. 20 నెలల కాలంలో వెయ్యి రావి ఆకులపై సందర్భాలను బట్టి వినూత్నంగా చిత్రాలను వేసినందుకు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఫౌండర్ కె.ఎల్లేష్‌కుమార్ చోటును కల్పించారు. ఆదివారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అవార్డును శివకుమార్‌కు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దారం శంకర్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, పరమేష్ పాల్గొన్నారు.

తపస్ నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీఈవో



తపస్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 31: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సంగారెడ్డి జిల్లా నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డీఈవో వెంకటేశ్వర్లు ఆదివారం ఆవిష్కరించారు. అంతకుముందు తపస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బర్దీపూర్ పీఠాధిపతి మహంత్ సిద్ధేశ్వర స్వామి, వైకుంఠపురం ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు, తండపల్లి శివయోగి స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తపస్ సంఘం జాతీయ భావాలు కలిగిన సంస్థ అని, దేశభక్తుల చిత్రాలు డైరీ, క్యాలెండర్‌పై ముద్రించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త మామిడి సుధాకర్‌రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, ప్రధాన కార్యదర్శి అడివప్ప, రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్‌దేశ్, మాధవరెడ్డి, శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఆరు గ్యారంటీల అమలు

ములుగు, డిసెంబరు 31: ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ములుగు మండలం అలీనగర్ గ్రామంలో ఆదివారం నూతనంగా పార్టీ గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చబోతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కొమురయ్య, గ్రామకమిటీ అధ్యక్షుడు రాములుగౌడ్, మాజీ సర్పంచ్‌లు భూపాల్‌రెడ్డి, నయిమోద్దీన్ పాల్గొన్నారు.